క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం, కోటపాడు, రామేశంపేట, వెంకటాపురం, దొడ్డిగుంట, సుభద్రంపేట గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి వార్షికోత్సవం



పందలపాకలో అభయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

బిక్కవోలు: పందలపాక కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న అభయాంజనేయ స్వామి 9వ వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు గరిమెళ్ల విశ్వేశ్వరరావు(బుజ్జి) ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధన చేశారు. పూజా కార్యక్రమాల్లో గొలుగూరి సత్యనారాయణరెడ్డి, సీతామహాలక్ష్మి, పడాల సత్యనారాయణరెడ్డి, అరుణ, మేడపాటి నాగిరెడ్డి, కొవ్వూరి భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో పూడిక తొలగింపు

రంగంపేట: సుభద్రంపేట గ్రామంలోని డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడికల్ని పారిశుధ్య కార్మికులు గురువారం శుభ్రం చేశారు. సర్పంచ్ కూటి సాయితాతారావు ఆధ్వర్యంలో మురుగు కాలువల్లో తీసిన పూడికను ట్రాక్టర్ల సహాయంతో ఊరి బయటకు తరలించారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నామని సర్పంచ్ తెలిపారు.

క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి

బిక్కవోలు: గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని కొంకుదురు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. గురువారం కొంకుదురు పీహెచ్‌సీ వద్ద ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్(పీఎంఎస్‌ఎంఏ) కార్యక్రమంలో భాగంగా 25 మంది గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులు రక్తహీనత నివారించేందుకు పౌష్టికాహారం తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు లేకుండా కాన్పులు జరుగుతాయని చెప్పారు. సమయానికి టీకాలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయాలి

పెదపూడి: సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేయాలని ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి అన్నారు. ఆయన పెదపూడి గ్రామంలో సచివాలయాన్ని గురువారం సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించి సచివాలయం అందిస్తున్న సేవలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాయాల్లో పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. సచివాలయం నుంచి అందిస్తున్న సుమారు 540 రకాల సేవలను ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఆయన వెంట సచివాలయ కార్యదర్శి మన్యం శ్రీనివాస్‌చౌదరి తదితరులున్నారు.

కేంద్ర బృందం పర్యటన



కొమరిపాలెంలో పర్యటించిన కేంద్ర సర్వే టీం సభ్యులు

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెం గ్రామంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి నేషనల్ లెవల్ మోనిటరింగ్ టీం(ఎన్‌ఎల్‌ఎం) సభ్యులు పి.హైడిరాజు, పి.విజయరాజులు గురువారం పర్యటించారు. గ్రామంలోని కేంద్ర పథకాల ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల వివరాలు సేకరించి పథకాలు ఎలా అమలవుతున్నాయో ఆరా తీశారు. తాము తయారు చేసిన రిపోర్టును ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, ఎంపీడీవో జేఏ ఝాన్సీ, పంచాయతీ కార్యదర్శి సత్తి శ్రీనివాస్ రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంతి రత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం

రాజానగరం: స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలోని నిడిగట్ల, వెలుగుబంద గ్రామాల మధ్య గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్టు పోలీసులు తెలిపారు. మృతుడి కనుబొమ్మ పైభాగాన, తల వెనుక ఉన్న గాయాలను బట్టి చనిపోయి 48 నుంచి 72 గంటలై ఉంటుందని భావిస్తున్నారు. శరీరంపై చిరిగిపోయిన చొక్కా, నీలం, ఎరుపు గడులతో కూడిన టవల్ తప్ప ఏవిధమైన దుస్తులు లేవన్నారు. ఆచూకీ తెలిసినవారు తమను సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సొంతింటి పనులు చకచకా..



సంపత్ నగరంలో జోరుగా నిర్మాణాలు



కోరుకొండ మండలం జంబూపట్నంలోని జగనన్న లేఅవుట్‌లో నిర్మిస్తున్న ఇళ్లు

- జగనన్న కాలనీల్లో జోరుగా నిర్మాణాలు
- రాజానగరం నియోజకవర్గంలో 52 లేఅవుట్లు
- ఉగాదికి గృహప్రవేశాలకు సన్నాహాలు

మధురపూడి: ఉగాది నాటికి జగనన్న కాలనీల్లో గృహప్రవేశాలు జరగాలన్న లక్ష్యంతో అధికార యంత్రాంగం పనిచేస్తోంది. రాజానగరం నియోజకవర్గంలో లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం జోరందుకుంది. పేదలకు సొంతిల్లు ఇవ్వాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. నియోజకవర్గంలోని కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లోని 62 గ్రామాల్లో 52 లేఅవుట్లు ఉన్నాయి. వీటిలో ఇళ్లు కట్టుకోవడానికి 8,539 మంది లబ్ధిదారులు సన్నద్ధమవుతున్నారు. వీటిలో 2,774 గృహాలు పూర్తయ్యాయి. 5,640 వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. 125 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించకుండా తాత్సారం చేస్తున్నారు.

ఇంటికి నిర్మాణానికి రూ.1.80 లక్షలు

లబ్ధిదారుడుకి సౌకర్యవంతంగా ఉండటానికి ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1,80 లక్షలు ప్రభుత్వం అందజేస్తోంది. ఈ నగదును బేస్‌మెంట్ స్టేజ్, రూఫ్ లెవల్, శ్లాబ్, నిర్మాణం పూర్తయ్యాక అందజేయడం జరుగుతోంది. సొమ్ము లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో నేరుగా జమమవుతోంది. సొంత స్థలమున్న వారికి కూడా గృహ నిర్మాణానికి అవకాశం ప్రభుత్వం కల్పించింది.

గ్రామాల్లో సందడి



రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం పేదలకు అక్కరకొచ్చింది. బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వం అండగా నిలిచింది. గ్రామాల్లో బడుగులు ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. రాజానగరం నియోజకవర్గంలోని 52 లేఅవుట్లలో 8,539 మంది లబ్ధిదారులకు చెందిన ఇళ్ల నిర్మాణాలు జరుగుతోంది. వీటిలో 2,774 గృహాలు పూర్తయ్యాయి. 5,640 గృహాలు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. 125 మంది లబ్ధిదారులు వారి ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించకుండా తాత్సారం చేస్తున్నారు.

– ఆకుల వెంకట్రావు, ఏఈ, గృహనిర్మాణ శాఖ, కోరుకొండ

ఎమ్మెల్యే రాజా ప్రోత్సాహం



ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా ప్రోత్సాహంతో నియోజకవర్గంలోని 52 లేఅవుట్లలో 2,774 ఇళ్లు చివరి దశకు చేరుకున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో 5,640 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ జగనన్న ఇళ్ల స్థలాల్లో ఒకే చోట వందల ఇళ్లు ఉండడం, వేల కుటుంబాలు నివాసం ఉండటంతో గ్రామాలకు కొత్త వెలుగులు రానున్నాయి. దీని కారణంగా కొత్త గ్రామాలు సిద్ధమవుతున్నాయి.

– కడియాల పాపారావు, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు, కోరుకొండ

అద్దెల భారం నుంచి విముక్తి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పేదలకు సొంతింటి కల సాకారమవుతోంది. వారికి అద్దెల భారం నుంచి విముక్తి లభిస్తోంది. ప్రతి నెలా రూ.2,500 నుంచి రూ.5 వేల వరకూ అద్దెలు చెల్లిస్తున్నారు. సొంతిల్లు పూర్తయితే వారికి ఆర్థిక ఇబ్బందులు తీరతాయి.

– కాళ్ల వీరబాబు, ఎంపీటీసీ, కోరుకొండ

గృహసారథులు.. సంక్షేమ వారధులు



కోరుకొండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా

- ఐక్యంగా ముందుకు సాగాలి
- ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలి
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: గృహసారథులు.. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మండపంలో గురువారం వలంటీర్లు, గృహసారథులు, సచివాలయం కన్వీనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవిశ్రాంతంగా సేవలందించాలనే లక్ష్యంతో వలంటీర్లు, గృహసారథులు వ్యవహరించాలన్నారు. ఈనెల 20 నుంచి ప్రజల వద్దకు వెళ్లే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. మా నమ్మకం నువ్వే జగనన్న నినాదం ప్రతి ఇంటా ప్రతిధ్వనించాలన్నారు. ఈ కార్యక్రమంలో గత నాలుగు సంవత్సరాలుగా ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. గృహసారథులు, సచివాలయం కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి జగనన్న సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ఆయా ఇంటి యజమానులు, సభ్యులకు అందిన సంక్షేమ పథకాల వివరాలతో పాటు, గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చుచేసిన నిధులను తెలపాలన్నారు. ఈ ప్రజా ప్రభుత్వం నిర్వహిస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, సామాజికాభివృద్ధి జరగాలన్నా జగనన్న ప్రభుత్వం ద్వారానే సాధ్యమవుతుందన్నారు. వలంటీర్, క్లస్టర్‌కు చెందిన గృహసారథి సమన్వయంతో నడుచుకోవాలన్నారు. ఐక్యంగా పనిచేద్దాం. సంక్షేమ ప్రభుత్వాన్ని రక్షించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కోకన్వీనర్ గణేశుల పోసి, మాజీ కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, పార్టీ నాయకులు కల్యాణం రాంబాబు, గొల్లపల్లి ప్రవీణ్ కుమార్, నేతుల చిన్ని, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ

రాజానగరం: ముక్కినాడలో నిర్మించిన షిరిడీ సాయిబాబా మందిరంలో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఉదయం 8 గంటలకు వేదపండితుల మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా ఈ ఉత్సవం నిర్వహించారు. అనంతరం సాయిబాబాను రాజానగరం, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ దర్శించుకున్నారు. అదే గ్రామానికి చెందిన జీవిత బీమా సంస్థ విశ్రాంత అధికారి అనదాస శేషయ్య, ఆయన సోదరుడు సోమరాజు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ మందిరాన్ని నిర్మించారు. రాజానగరం, అనపర్తి, రంగంపేట, గండేపల్లి, కోరుకొండ, రాజమహేంద్రవరం, ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

సత్తెమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు



సత్తెమ్మతల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు

అనపర్తి: మండలంలోని కుతుకులూరులో కొలువుదీరిన సత్తెమ్మతల్లి అమ్మవారిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నల్లమిల్లి వంశీకులు తమ ఇలవేల్పుగా కొలిచే అమ్మవారి జాతరలో భాగంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులతో పాటు అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లు హేమతులసి సురేష్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎన్‌డీఆర్, ఎంపీటీసీ సత్తి దొరయ్యరెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పడాల హరిసాయి కృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు



సామూహిక నాగబంధన పూజలను నిర్వహిస్తున్న భక్తులు

అనపర్తి: మండలంలో పులుగుర్తలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు పండితుల వేద మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన గురువారం ఉదయం విష్వక్సేన పూజ, బలిహరణ, ఉక్త హోమాది క్రతువులు, సామూహిక నాగబంధన పూజలను పండితులు వైఖానసాగమ శాస్త్రానుసారంగా జరిపించారు. సాయంత్రం నవగ్రహారాధన, ప్రధాన కుంభారాధన పూజల అనంతరం గోదావరినదీ మాతకు పసుపు, కుంకుమల సమర్పణ, నదీ హారతి నిర్వహించారు. రాత్రి హంస వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి గ్రామోత్సవం జరిపారు. కమిటీ అధ్యక్షుడు తాడి గణపతి, కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

క్రికెట్ జట్టు కెప్టెన్‌గా శివ ఎంపిక



కెప్టెన్‌గా ఎంపికైన శివ, స్టాండ్‌బైగా ఎంపికైన శివరామరెడ్డిని అభినందిస్తున్న కొండబాబు తదితరులు

అనపర్తి: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం క్రికెట్ పురుషుల జట్టు కెప్టెన్‌గా అనపర్తి జీబీఆర్ కళాశాల విద్యార్థి చల్లారపు శివ ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని జీబీఆర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు ఎంవీవీ రామారెడ్డి, వి.జయరాజులు గురువారం విలేకరులకు తెలిపారు. కళాశాలకు చెందిన ఎస్.శివరామరెడ్డి స్టాండ్‌బై కెప్టెన్‌గా ఎంపికయ్యాడన్నారు. కాకినాడ జిల్లా క్రీడా సంఘం ప్రాంగణంలో ఈ నెల 7, 8 తేదీల్లో నన్నయ యూనివర్సిటీ క్రికెట్ పురుషుల టీమ్ సెలక్షన్స్ ట్రైల్స్ జరిగాయన్నారు. క్రికెట్ పురుషుల జట్టుకు ఎంపికైనవారు బెంగుళూరు రేవా యూనివర్సిటీలో ఈ నెల 20 నుంచి మార్చి 5 వరకూ జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. కెప్టెన్‌గా ఎంపికైన శివ, స్టాండ్‌బైగా ఎంపికైన రామారెడ్డిలను కళాశాల కరస్పాండెంట్ మరియు సెక్రటరీ తేతలి ఆదిరెడ్డి, పాలకమండలి సభ్యులు జి.రామారెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌పీ అబ్బాయిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పీఆర్‌ఎల్ స్వామి, స్కూల్స్ డీన్ హరిప్రసాద్ తదితరులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థుల దుర్మరణం



జానకిరామ్ (ఫైల్)



సాయికుమార్ (ఫైల్)

జంగారెడ్డిగూడెం: జాతీయ రహదారిపై పట్టణ పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు మృతి చెందారు. ఎస్సై ఎం.సాగర్‌బాబు, సహచర విద్యార్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన మోకా జానకిరామ్ (21) జంగారెడ్డిగూడెం మండలం వేగవరంలోని నోవా ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం మల్లవరం గ్రామానికి చెందిన కొట్టేటి సాయికుమార్ (22) ఇదే కళాశాలలో ఇంజినీరింగ్ నాలుగో ఏడాది పూర్తయి బ్యాక్‌లాగ్‌లు ఉండటంతో సప్లిమెంటరీ పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్నాడు. వీరిద్దరూ వేగవరంలో ఓ రూమ్‌ను అద్దెకు తీసుకుని ఉంటున్నారు. గురువారం సాయంత్రం వ్యక్తిగత పనులపై ఇద్దరూ బుల్లెట్‌పై జంగారెడ్డిగూడెం వెళుతున్నారు. సబ్‌స్టేషన్ సమీపంలోకి వచ్చేసరికి జంగారెడ్డిగూడెం నుంచి హైదరాబాద్ వెళుతున్న లారీని బుల్లెట్ ఢీకొంది. దీంతో జానకిరామ్ తలపైభాగం నుంచి లారీ దూసుకుపోగా, సాయికుమార్ లారీ వెనుక చక్రాల మధ్య ఇరుక్కుపోయి ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్సై ఎం.సాగర్‌బాబు, సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు. సహచర విద్యార్థుల సహాయంతో ఇద్దరి మృతదేహాలను మానవతకు చెందిన వాహనంలో స్థానిక ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. జానకిరామ్, సాయికుమార్ ప్రయాణిస్తున్న బుల్లెట్‌కు ఒక సీటే ఉండటం గమనార్హం. సహచర విద్యార్థులు తెలిపిన వివరాలు ప్రకారం వేగవరంలో వీరు బయలుదేరే సమయంలో బుల్లెట్‌ను జానకిరామ్ నడుపుతున్నట్లు చెబుతున్నారు. మితిమీరిన వేగమే ప్రమాదానికి కారణం అని చెబుతున్నారు. కాగా వీరి మృతిపై సహచర విద్యార్థులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తమ కళ్ల ముందే బయలుదేరిన కొద్దిసేపటికే విగత జీవులుగా మారడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు.

లోవోల్టేజ్ సమస్య నివారణకు చర్యలు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన



వెలుగుబందలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: నియోజకవర్గంలో లోవోల్టేజ్ సమస్య ఎదురుకాకుండా అవసరమైన ప్రతిచోటా విద్యుత్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని రాధేయపాలెం, వెలుగుబందలో రూ.8 కోట్లతో ఏర్పాటు చేయనున్న రెండు సబ్‌స్టేషన్ల నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గృహ, వ్యవసాయ, పరిశ్రమ అవసరాలకు కూడా పూర్తిస్థాయిలో విద్యుత్ అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మెట్ట ప్రాంతమైన రాజానగరం మండలంలో ఎక్కువగా రైతాంగం బోర్ల పైనే ఆధారపడి సాగు చేస్తుంటారన్నారు. గతంలో ఈ మండలం కడియం నియోజకవర్గంలో ఉండేదని, ఆ సమయంలోనే తన తండ్రి ఎమ్మెల్యే, మంత్రిగా ఈ ప్రాంతంలో విరివిగా విద్యుత్ సబ్‌స్టేషన్లు తీసుకువచ్చారన్నారు. ఆ తరువాత పెరిగిన అవసరాలను దృష్టిలో పెట్టుకుని మరికొన్ని ప్రాంతాలలో అదనంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాధేయపాలెంలో రూ. 2.8 కోట్లు, వెలుగుబంద జగనన్న కాలనీలో రూ. 5 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల నాలుగు నెలల్లో నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మండారపు సీతారత్నం, జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, సర్పంచ్ నురుకుర్తి దుర్గ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, మాజీ కన్వీనర్ మండారపు వీర్రాజు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ గండి నానిబాబు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, ఉగ్రింకల శ్రీను, ప్రగడ గోవిందు, విద్యుత్ శాఖ ఎస్‌ఈ టీవీఎస్‌ఎన్ మూర్తి, ఈఈ శ్యామూల్, ఏడీఈ నటరాజన్, ఏఈలు శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నిస్వార్థ ప్రజానాయకుడు అమ్మిరెడ్డి




అమ్మిరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న చింతా పాండురంగారెడ్డి

అనపర్తి: ఉన్నత విలువలు పాటిస్తూ సమాజాభివృద్ధికి కృషి చేసిన నిస్వార్థ నాయకుడు మాజీ ఎమ్మెల్యే పడాల అమ్మిరెడ్డి అని పారిశ్రామికవేత్త చింతా పాండురంగారెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే పడాల అమ్మిరెడ్డి 80వ జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక జీబీఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలోని పడాల అమ్మిరెడ్డి విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడుతూ నీతి, నిజాయితీతో ప్రజలకు సేవలందించడంతో పాటు అనపర్తి ప్రాంత విద్యాభివృద్ధి కోసం అమ్మిరెడ్డి కృషిచేశారన్నారు. కార్యక్రమంలో జీబీఆర్ విద్యాసంస్థల అధినేత తేతలి ఆదిరెడ్డి, అమ్మిరెడ్డి తనయుడు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పడాల రామారెడ్డి, తొస్సిపూడి మాజీ సర్పంచ్ తేతలి జగ్గిరెడ్డి, వ్యాపారవేత్త తేతలి నారాయణరెడ్డి, రాష్ట్ర లారీ యూనియన్ అధ్యక్షుడు చిర్ల అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సారారహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

సెబ్ అడిషనల్ ఎస్పీ సోమశేఖర్



మర్రిపూడిలో సిబ్బందికి సూచనలిస్తున్న సెబ్ అడిషనల్ ఎస్పీ సోమశేఖర్

రంగంపేట: గ్రామాలను సారారహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేయాలని రాజమహేంద్రవరం సెబ్ అడిషనల్ ఎస్పీ పిట్టా సోమశేఖర్ సూచించారు. సారా తయారీ, విక్రయాల్లో మండలంలో రెడ్ విలేజ్‌గా ఉన్న మర్రిపూడిలో గురువారం పోలీసు, సెబ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా అమ్మకాలు నిర్వహించే ఇళ్లతో పాటు, సారా తయారు చేసే ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో ఎవరైనా సారా తయారీ, అమ్మకాలు, రవాణా చేస్తే కఠిన చర్యలతో పాటు పీడీ యాక్ట్ పెడతామని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. దాడుల్లో సెబ్ సీఐ వెంకటలక్ష్మి, సూపరింటెండెంట్ రాంబాబు, ఎస్ఐ టి.రామకృష్ణ, పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



పెదపూడి ఎరువుల షాపులో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ స్వాతి

పెదపూడి: ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే సంబంధిత షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని పిఠాపురం ఏడీఏ పి.స్వాతి హెచ్చరించారు. ఆమె పెదపూడి, దోమాడ, కరకుదురు తదితర గ్రామాల్లో ఎరువుల షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు సంబంధించిన రశీదులను తమ వద్ద తప్పనిసరిగా ఉంచుకోవాలన్నారు. షాపు యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయాలు చేపట్టకపోతే సంబంధిత షాపుల్ని బ్లాక్ లిస్టులో పెడతామన్నారు. షాపుల వద్ద ధరల పట్టిక ప్రదర్శించాలని చెప్పారు. ఆమె వెంట ఏఓ టీవీఆర్ మణిదీప్, ఏఓ వెంకటలక్ష్మి తదితరులున్నారు.

గ్రాసిం విస్తరణకు వ్యతిరేకంగా ర్యాలీ

బిక్కవోలు: బలభద్రపురంలోని గ్రాసిం ఇండస్ట్రీస్ విస్తరణకు వ్యతిరేకంగా మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బలభద్రపురం నుంచి తొస్సిపూడి వంతెన వరకూ గురువారం ర్యాలీ నిర్వహించారు. గ్రాసిం విస్తరణ వద్దు ప్రజల ఆరోగ్యమే ముద్దు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నాయి.

భోజనం ప్యాకెట్ల వితరణ



భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న బాబా వసతి మందిరం సభ్యుడు

సీతానగరం: చినకొండేపూడిలోని షిర్డీ సాయిబాబా వసతి మందిరం ఆధ్వర్యంలో దాతలు గ్రంధి వెంకట రామారావు దంపతులు, కురువెళ్ల వెంకట మురళీకృష్ణ సహకారంతో గురువారం భోజనం ప్యాకెట్లు వితరణ చేశారు. వీటిని సుమారు 150 మంది పేదల ఇళ్లకు వెళ్లి సేవాసమితి సభ్యులు అందజేశారు.

బాధిత కుటుంబాలకు సాయం



నిత్యావసరాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో నాలుగు బాధిత కుటుంబాలకు జక్కంపూడి రామ్మోహన్‌రావు ఫౌండేషన్ వారి అక్షయ సంజీవని కార్యక్రమంలో భాగంగా గురువారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. బియ్యం, రూ.రెండు విలువైన నిత్యావసరాల కిట్లను వైఎస్సార్ సీపీ నాయకులు కాండ్రు వీరన్న, తోరం బ్రహ్మజీ, పైల మురళీకృష్ణ, మట్ట నాగేశ్వరరావు అందజేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజానగరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11 కేవీ ఫీడర్లకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కా శామ్యూల్ తెలిపారు. రాజానగరం, ఫరిజల్లిపేట, సూర్యారావుపేట, గైట్ కాలేజ్, జీఎస్ఎల్ వైద్య కళాశాల, నన్నయ వర్సిటీ, బ్రిడ్జి కౌంటీ ప్రాంతాలకు విద్యుత్ ఉండదన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బిక్కవోలు: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందినట్టు ఎస్ఐ పి.బుజ్జిబాబు గురువారం తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం మండలంలోని తొస్సిపూడి గ్రామానికి చెందిన వైరాల రవి కిశోర్(16) చెడు వ్యసనాలకు బానిసవుతున్నాడని ఈ నెల 7వ తేదీన తల్లిదండ్రులు మందలించారు. దీంతో కోపగించిన రవి కిషోర్ గడ్డి మందు తాగేశాడు. పందలపాకలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.బుజ్జిబాబు తెలిపారు.